బంధోపహతులు

ట్రాన్స్ఫర్ ఆర్డర్ చదువుకున్న మూర్తి పెదవులపై చిరునవ్వు వెలిసింది.

"ఏమిటది భయ్యా ?" ఆశ్చర్యంగా అడిగాడు చరణ్.

"మా ఆంధ్రకు....ట్రాన్స్ఫర్ చేయించుకున్నా .... మా వూరికి....చీరాలకు !" గర్వంగా చెప్పాడు మూర్తి.

"నిజం ?" మహారాష్ట్ర యువకుడు నరేంద్ర నమ్మలేనట్లు చూశాడు.

"నిజంగానే ! మేనేజరుగారితో నేనేస్వయంగా చెప్పుకుని, అక్కడి ఈ ఆఫీసు బ్రాంచికి నన్ను వేయమని కోరాను. మొదట్లో వద్దన్నారు. కానీ నామాటకు విలువిచ్చి వేసారు. చివరకు !"

"ఎందుకు బ్రదర్ ! అంత దూరం వెడతావు ? వేరు వేరు రాష్ట్రాల నుంచి వచ్చినా, అందరం కలసి కట్టుగా, ఎంతో సరదాగా గడుపుతున్నాం ఈ పదేళ్ళ నుంచీ ! అలాటిది నువ్వీరోజు నీరాష్ట్రానికి వెళ్ళిపోవటం....మాకేమిటో వెలితిగా వుంది !...."స్నేహపూర్వకమైన బాధ నిండి వుంది బెంగాలీ యువకుడు ఛటర్జీ కంఠస్వరంలో.

"ఒద్దు మూర్తి భయ్యా !" అంది ఫాతిమాబేగం.

"నిజం చెబుతున్నాను మూర్తిజీ !....మీరు ఆంధ్రకు వెడతారంటే....మీ మిసెస్....మాలతిని వదిలి వుండటమెలా అన్నది దిగులుగా వుంది నాకు !" అంది సబిత.

చుట్టూరా, అందరూ తలకో కంఠంగా అరుస్తున్నారు. బాధపడ్తున్నారు. ఇందరి అభిమానాన్ని చూరగొన్నందుకు, తనమీద తనకే గర్వం కలుగుతోంది. అయినా లోలోపల తన నిర్ణయంమార్చుకో దల్చుకో లేదు,

స్నేహితులను ఎలాగో వదిలించుకుని, ఆఫీసునుంచి బయటపడి స్కూటర్ స్టార్ట్ చేశాడు మూర్తి. అతగాడి మనస్సులానే, స్కూటర్ కూడా ఆఘమేఘాలమీదపోతోంది.

తను ఇక తన బంధువుల మధ్యకు వెళ్తున్నాడు ! ఈ గ్వాలియర్ లో....ఈ మధ్యప్రదేశ్ లో ప్రవాసాంధ్రుడిగా వున్న "ప్రవాసం"రద్దుచేసుకుని, హాయిగా తన వాళ్ళతో కాలం గడుపుతాడు:

చెల్లాయిలలిత, దానిభర్త గోపాలం, ముగ్గురు పిల్లలూ చీరాలలోనే వున్నారు. వాళ్ళకు ఉత్తరం వ్రాస్తేసరి. వాళ్ల ఇంటికి దగ్గర్లో మంచి ఇల్లొకటి చూచి పెడతారు.

అమ్మ' నాన్నగారు, పెద్దన్నయ్య, మురళి, వదిన, శారద, వాళ్ళ నలుగురు పిల్లలూ గుంటూరులో వున్నారు ఈ కబురు తెలిసి సంతోషిస్తారు.

పెద్దనాన్న కొడుకు....తన వయసు వాడు రాఘవ బాపట్లలో వున్నాడు. పెద్దక్క శకుంతల, ఆమె భర్త

శ్రీహరిరావు, వాళ్ళ పిల్లలు ఐదుగురూ తెనాలిలో వున్నారు. ఇక ఆ చుట్టుప్రక్కలే చిన్నాన్నలూ, మేనమామ కొడుకులూ వాళ్ళ సంసారాలూ వూరి కొకరుగా, ఛాన్ కొకరుగా వున్నారు.

ఏ వివాహ సందర్భాలలోనో, విధి లేకపోతే తప్ప, తనకు వారం రోజులు శలవు దొరకదు! ఆ వారం రోజులు కనుమూసి తెరిచేంతలో దొర్లిపోతాయి!.... లలితనూ, అమ్మనూ, నాన్ననూ, అక్కయ్యనూ, అన్నయ్యనూ అందర్నీ తను పేరు పేరునా ఆహ్వానిస్తాడు....తన దగ్గరకు వచ్చి పది రోజులుండమని ఊహూఁ వాళ్ళు రాలేదెప్పుడూ!

"అంత లేసి డబ్బు పోసి రైలువాళ్ళను బ్రతికించటం ఎందుకు? ఈ పిల్లాజెల్లాతో కదిలిరావటమంటే మాటలా! నువ్విలా హారతి కర్పూరంలా మెరిసి మాయమవకుంటే, హాయిగా ఇక్కడికే ట్రాన్స్ఫర్ చేయించుకోరాదూ! ఎలాగూ మీ ఆఫీస్ బ్రాంచీలు ఇక్కడా పెడుతున్నారుగా! ఏమిటో! ఆంధ్రలో ఎక్కడా చోటేలేనట్లు....మా అందరికీ దూరంగా పరుగెత్తావు అంటారు అందరికందరూ.

అది నిష్ఠూరం నిండిన వాత్సల్యం. తనకూ అనిపిస్తుం టుంది తరచూ; ఏదో జీతం ఎక్కువనీ, మంచి "బోనస్"లు వుంటాయనీ ఇంత దూరం పరుగెత్తుకు వచ్చాడు. ఈరోజు బంధువుల కోసం మొహం వాచిపోతున్నారు తనూ మాలతి.

ఎంతసేపూ బెంగాలీలూ, సిక్కులూ, పార్శీలా.... ఒకరో-అరో తనలాటి ఆంధ్రులూ....హిందీ వాళ్ళూ....ఇలా

కలగా పులగం మేళం స్నేహితులతో పార్టీలూ పిక్నిక్‌లూ తప్ప...."మాబంధువు!" అంటూ చెప్పుకోనటానికెవరున్నా రిక్కడ?....ప్రమాదాలకయినా, ప్రమోదాలకయినా వాళ్ళే! అప్యాయత చూపుతారు....కాదనేందుకు లేదు. కానీ-బంధుత్వంలో ఇంతకు మించిన రక్తస్పర్శ, బంధం నిండి వుంటుంది.

పోయినసారి రాఘువ వివాహ సందర్భంగా అటువేపు వెళ్లారు తనూ, మాలతి, పిల్లలూ.

"ఓ రేయ్ ? మధ్యప్రదేశ్ కు అంకితమై పోయావా ఏమిట్రా ?" అంటూ కోప్పడ్డాడు రాఘువ.

అమ్మ, మాలతితో మరీ మరీ చెప్పిందిట...."పెద్ద వాళ్ళమయ్యాం - నేనూ, మీ మామగారూ....ఇక్కడ ఈ పెద్దాడికి మేమంటే ఎక్కడ లేని విసుగూ బయల్దేరింది ? ఇక కోడలు సరే సరి ! మాకు చావెప్పుడొస్తుందాని కసిపెట్టుకు్కూర్చుంది. మీరిద్దరూ మమ్మల్నీ, ఆడపిల్లల్నీ ఎంతో ఆప్యాయంగా చూచుకుంటారు....లలిత' శకుంతల నిన్ను కలవరిస్తుంటా రెప్పుడూ! మీరు దగ్గర్లో వుంటే, హాయిగా మీ దగ్గరే వుందుము గదా !"

మాలతి చెప్తూను - చెప్తూను మురిసి పోతుంటుం దెప్పుడూ ! ఏ స్త్రీకయినా, తన తోటికోడలి కంటే, తనని ఎక్కువగా అభిమానిస్తున్నారంటే ఆనందమే కదామరి !

ఆసారి రాము తిరిగి గ్వాలియర్ కు వస్తూంటే....తమ నెవరో - ఏ కొండకోనలలోకో దూరంగా విసిరివేసినట్లనిపించి,

ఏమిటో బాధనిపించింది. ఈ వచ్చీరాని తెలుగులో- వేధించే ఈ మిత్రులూ.... వీరి వంటకాలూ.... తగని వెగటుగా తోచసాగాయి.

ఈ ట్రాన్స్ఫర్ మాలతికి కూడా ఇష్టమే ! విని ఎంతో ఆనందిస్తుంది.... స్కూటర్‌తో బాటు ఆలోచనలూ ఆగాయి. స్కూటర్ దిగి హుషారుగా లోపలికి వెళ్ళాడు మూర్తి.

సంగతి తెలిసిన మాలతి ఎంతో సంబరపడింది !

వారం రోజుల్లో సామాన్లు సర్ది, పాక్ చేసి పంపేశాడు. తమ కోసం టిక్కెట్లు రిజర్వు చేయించుకోవటమూ అయింది.

మిత్రులంతా స్టేషన్‌కు వచ్చారు.

"పదేళ్ళుగా ఒక్క చెట్టుమీది పక్షుల్లా, హాయిగా.... మళ్ళీ మనం కలుసుకోగలమో.... లేదో....దయచేసి మా అందరి స్నేహానికి గుర్తుగా.... ఈ చిన్న బహుమతి పుచ్చుకోండి !" అందంగా నగిషీలు చెక్కిన స్టాండు మీద, వెండి రాధా కృష్ణుల విగ్రహం ఇచ్చారు అందరూ....

క్షణకాలం మూర్తి, మాలతిల హృదయాలు ఆర్ద్రమై పోయాయి. మరుక్షణంలో తాము ముందు ముందు చవి చూడబోయే బంధు ప్రేమ గుర్తుకు వచ్చి.... కెరటంలా పుప్పొంగిన బాధను, చప్పున చల్లార్చి వేసింది....

ట్రెయిన్ కదిలింది.... గ్వాలియర్ స్టేషనూ.... కోట.... మెల్లిగా కనుమరుగై పోయాయి....

* * *

"ఇదేం బుద్ధిరా అన్నయ్యా నీకు? ఎక్కడేనా ఇల్లు చూడమన్నానా? చక్కగా మా ప్రక్క పోర్షన్‌లో చేర కూడదూ?" అంటూ వాత్సల్యంగా కోప్పడింది లలిత.

నవ్వేశారు మూర్తి, మాలతి. లలిత వాళ్ళున్న ఇంటికి ఓ ఫర్లాంగు దూరంలోనే వుంది ఈ ఇల్లు.

రోజూ సాయంత్రంపూట లలిత, గోపాలం, పిల్లలు వస్తున్నారు. వాళ్ళకు రావటానికి వీలుగాని రోజు మూర్తి, మాలతి, పిల్లలు వెళ్ళి వస్తారు. చాలా సరదాగా గడచి పోతున్నాయి రోజులు.

వీలుచూచుకుని గుంటూరుకు వెళ్ళారు మూర్తి,మాలతి.

అన్నయ్య మురళి, వదిన శారదల ప్రవర్తన మాత్రం బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు మూర్తికి.

"అక్కడ ఆఫీసు వర్క్ అదీ వసతిగా లేదా మూర్తీ?" అన్నాడు మురళి.

"అదేం లేదు!"

"మరి? ట్రాన్స్ఫ రెందుకు కోరావు?" ఆ ప్రశ్నలో ఏదో కాఠిన్యం మరేదో బాధ నిండివున్నట్లు తోచింది మూర్తికి.

గతుక్కుమంది మూర్తి మనసు. మురళి అన్నయ్యకు తామిక్కడకు.... ఈ ప్రాంతాలకు రావటం ఇష్టంలేదా? ఇందాకా ఏకచ్ఛత్రాధిపత్యంగా 'మేనేజ్, చేస్తున్న 'ఆస్తి'కి ఇకపై తన కన్నూ వుంటుందేమోనని బాధపడుతున్నాడా?

భయపడుతున్నాడా? ఇంత సంకుచిత స్వభావునిగా మారి పోయాడా అన్నయ్య? మూర్తి ఆలోచిస్తుండగానే గదిలోకి మాలతి వచ్చింది.

"ఏమిటో మీ వదిన మనస్తత్వం నాకు అంతు పట్టడంలేదు! ఇలా గడపలో కాలు పెట్టామో లేదో.... తెగ ఇదై పోతోంది! 'ఏం బావుకుందామని వచ్చారు మాలతీ ట్రాన్స్ఫర్ చేయించుకుని? మేం అనుభవిస్తున్నది చాలదూ?' అనేసింది! ఏమిటో ఆవిడ భయం! అత్తగార్ని, మామగార్ని పిల్చుకెళ్ళటానికి వచ్చాం....ఇక ఈ ప్రాంతంలో వుండాలనే వచ్చాం! అని ఘాటుగా జవాబిచ్చే సరికి నోరు మూసుకుంది! పాపం! ఈ కుళ్ళురకాలతో అత్తగారూ! మామగారూ! ఎలా వేగుతున్నారో ఇన్నేళ్ళుగా! సాయంత్రం వాళ్ళని పిల్చుకుని వెళ్ళిపోదాం!" అంది రుసరుసలాడుతూ.

మూర్తికి కూడా అదే మంచిదనిపించింది....మూర్తి, మాలతిల వెంటరావటానికి పెద్ద వాళ్ళిద్దరూ క్షణంలో సిద్ధపడ్డారు!

"పాపం! మా అమ్మా, నాన్నా ఏదో నరకంలో నుంచి బయట పడినట్లూ, స్వర్గంలోకి వచ్చినట్లూ ఫీలౌతున్నారు మాలతీ!" అన్నాడు మూర్తి.

"అవును సుమండీ!" అంది మాలతి గొప్పగా!

"నీలా శుచిగా, శుభ్రంగా, మడిగట్టుకుని....మాకు ఒక్కరోజైనా వండి వార్చిందా శారద? ఏనాడో దానికి

పిల్లలు పుట్టకముందు తప్పిస్తే! నీకూ లేరూ పిల్లలు!" అంటున్న అత్తగారి మాటలతో పొంగిపోయింది మాలతి.

"ఒక్కరోజయినా ఇలా ఆప్యాయంగా దగ్గరకూర్చొని ఆఫీసు కబుర్లూ, అవీ ఇవీ చెప్పాడుటరా మీ అన్నయ్య? అస్తమానూ పెళ్లాం కొంగుచ్చుక తిరగటమే నాయె!" అంటున్న తండ్రి మాటలతో....తన జన్మ ధన్యమైందనీ.... తను నిజంగా తలిదండ్రుల ఋణం తీర్చుకో గలిగే గొప్ప పనిచేస్తున్నాననీ అనిపించింది మూర్తికి.

సంక్రాంతి రాబోతోందనగా....పిల్లలకూ, మాలతికీ తనకూ బట్టలు కొనుక్కోటానికి షాపింగ్‌కు బయల్దేరారు....

"లలిత కూడా వస్తానందిరా మధ్యాహ్నం!...." అంది తల్లి వెనుకనుంచి.

"రానీ అమ్మా! అందరం కలిసే వెడదాం!" అన్నారిద్దరూ.

లలితతో షాపింగ్‌కు వెళ్ళి - లలితకూ, గోపాలానికీ, వాళ్ళ పిల్లలకూ కూడా బట్టలు తీసుకున్నారు. లలిత తన బిల్లు చెల్లిస్తానంది. మూర్తి, మాలతి ఇద్దరూ కోప్పడ్డారు వద్దని.

"ఎంత మంచి బట్టలు కొన్నావురా మూర్తి చెల్లెలికీ, దాని పిల్లలకూ....ఏ ఒక్కనాడేనా ఇలాటి బట్టలు పెట్టటానికి నా ఆడపిల్లలకు - మీ వదిన మనసొప్పింది? ఎంతైనా నీ భార్య గుణమే వేరు?" అంది తల్లి.

"బ్యాంకి అకౌంటు నుంచి, ఈ నెలలో అదనంగా ఓ వంద రూపాయలు 'డ్రా' చేస్తే చేసేం కానీ.... ఇంతటి ఆత్మ సంతృప్తి ఎప్పుడేనా అనుభవించేమా మాలతీ ?" అన్నాడు మూర్తి ఆ రోజు.

"నిజం !" అంది మాలతి తృప్తిగా.

"పండగకు శకుంతలనుకూడా రమ్మని రాయరా మూర్తీ! అందరం పండగ జరుపుకుందాం ?" అంది తల్లి.

"తప్పకుండా అమ్మా !" అన్నాడు మూర్తి- అప్పటి కప్పుడే కవరు వ్రాసి పోస్టుకు పంపిస్తూ.

ఆ పండగెంతో సరదాగా గడిచి పోయింది....

"మరో రెండు వందలేగా బ్యాంకినుంచి తీశాం ! పై నెలలో జమ వేసేద్దాంలే.... పండగా.. మన వాళ్ళూ.... పై నెలలో వస్తారా ఏమిటి!" అనుకున్నా రిద్దరూ ఆనందంగా.

కోర్టు పని కోసం వచ్చే చిన్నాన్నలూ పెళ్ళి మనువుల కోసం వచ్చే మేనమామ కొడుకులు, ఇళ్ళ స్థలాలేవో కొన టానికి వచ్చేపెత్తల్లీ, రాఘున, నాటకాలకు సంబంధించిన పనిమీద వచ్చే బావ మరదులూ, వారానికోసారి పొలం పని కోసం వచ్చే పెద్దబావ....అంతా మాలతి ఓర్పునూ, నేర్పునూ, శ్లాఘిస్తున్నారు ....మూర్తి బంధుప్రేమనూ, లోభత్వం తెలీని మంచి గుణాన్ని కీర్తిస్తున్నారు. మాలతి చేసే, మధ్యప్రదేశ్ లో నేర్చుకొన్న కొత్త రకం పిండి వంటల్ని-మెచ్చుక మెచ్చుక మరీ తిని-తిని, పట్టించుక

వెళ్తున్నారు. బైదిబై మురళి, శారదల పిసినారితనాన్నీ, బంధుద్వేషాన్నీ, కుళ్ళు గుణాన్నీ, కాఠిన్యాన్నీ రకరకాలుగా వ్యాఖ్యానిస్తున్నారు. ఏ రోజు చూచిన ఇల్లు పెళ్ళిల్లులా కళకళ లాడుతోంది! బంధువులకు, వారిప్రీతికీ మొహం వాచివున్న మూర్తి, మాలతిలకు విందులా వుంది!

"మాపుట్టిల్లు ఇలాగే వుండేదిరా! ఎత్తే విస్తరీ-వేసే విస్తరీ....ఆ కళ వుట్టి పడుతోందిప్పుడు?" అందో రోజు తల్లి.

ఆ మెప్పుదల బావుంది గానీ....ఆమె పుట్టిల్లు నేల మట్టమై పోయి, అప్పులతో ఆస్తంతా చితికి పోయి, అది గుర్తుకు వచ్చి ఆ ఉదాహరణ చివుక్కు-మనిపించింది మూర్తికి. ఎలాగో సంబాళించు కున్నాడు.

ఆరు నెలలు ఆరు రోజులుగా గడిచి పోయాయి.... ఈ ఆరు నెలల్లో ఇటుకేసి రానిదల్లా మురళీ, శారదలు మాత్రమే! ఆహ్వానించినా-ఏదో ఓ సాకు వ్రాస్తారే తప్ప రాలేదు....

"మనల్ని అందరూ పొగడటం-సహించలేకపోతున్నా రేమో మీ అన్నయ్య, మీవదిన....అంచేతే ఇటుకేసి రావ టానికి మొహం చెల్లలేదు వాళ్ళకు....తమ తప్పేమిటో-తమకే తెలిసి వచ్చుంటుంది! అంది మాలతి.

"అవును!" అన్నాడు మూర్తి.

రెండవ ఆరు నెలలు ప్రారంభమయ్యాయి....

ఈ మధ్య మాలతి ఎందుకో కొంచెం చిక్కిపోయింది. మూర్తిలో కూడా కొద్ది కొద్దిగా అలసట చోటు చేసుకొంటోంది.

ఆరోజు సాయంత్రం....ఆఫీసునుంచి ఇంటికి రాగానే.... "కబుర్లేమిటిరా ?...." అంటూ పలకరించాడు తండ్రి. ఆయన గారికి రోజూ కబుర్లు సృష్టించి చెప్పాలంటే....విసుగనిపిస్తోంది మూర్తికీ మధ్య....అందులోనూ ఆఫీసునుంచి రాగానే, ఆ అలసటైనా తీరకుండా, నిలవేస్తాడు....

"కబుర్లేం లేవు నాన్నా !" విసుగుదల పైకి పొంగకుండా జాగ్రత్త పడుతూ లోపలికి వచ్చాడు మూర్తి.

హాల్లో కూర్చుని వున్న తల్లి రోజూలా "రా ! రా ! మూర్తీ ! ....మాలతీ ! అబ్బాయొచ్చాడు.... కాఫీపట్రా ! అంటూ ఆప్యాయంగా పలకరించలేదు సరికదా, చూడనట్లు, మొహం తిప్పుకుంది....మాలతి కూడా అంతటి ముభావంగానూ కాఫీ తెచ్చిచ్చింది.

"ఏమిటి మాలతీ అలా ఉన్నావ్ ?" అన్నాడు మూర్తి మెల్లగా.

"ఇంకెలా వుంటాను.... ఈ చాకిరీతో నా ప్రాణాలు పోయేలా వున్నాయి !" అంది విసురుగా.

ఈ రోజెవరొచ్చారు బంధువులు ?" భయంగా ఇల్లు నలుమూలలా పరిశీలిస్తూ అన్నాడు మూర్తి. గ్వాలియర్‌లో

వుండగా నెలా నెల విధిగా బ్యాంకిలో వేస్తుండిన డబ్బు కాస్తా అయిపోయి నెల దాటింది! ఈ మధ్య మూడు వందలు అప్పు కూడా అయింది!

"రానిదెప్పుడు? లేనిదెప్పుడు?...." విసుగ్గా అంది మాలతి.

"అసలేమిటి గొడవ?" మూర్తికికూడా చిరాకుగా వుంది.

"ఏం చెప్పను? మొన్న సాయంత్రమే కాదూ, ఆరు రూపాయలుపెట్టి చాక్‌లెట్స్ తెచ్చారు మీరు? ఈ పూట పాప మారాం చేస్తుంటే- పెడదామంటే ఒక్కటీ లేదు. అదొకటే ఏడుపు ఆపకుండా! దానికితోడీ మడి వ్యవహారం ఒకటి....పిల్లలను అస్తమానూ దూరంగా వుంచాలి. వాళ్ళు అవి ముట్టుకున్నారూ - ఇవి ముట్టుకున్నారూ అని మీ అమ్మ గారొకటే గొడవ! నేనేమో అస్తమానం చింపిచేరులా- ఈ మడిబట్టతో....పస్తులతో...." ఇక ఓపిక లేని మాలతికి కళ్ళ నిండుగా నీళ్ళు వచ్చేశాయి.

తల్లి ఒక్కసారిగా విరుచుక పడింది. "లలిత, దాని పిల్లలూ వస్తున్నారనేగా దాని బాధ? ఎల్లకాలం వాళ్ళేదో ఇక్కడపడి తింటారని భయం! వాళ్ళేం గతిమాలిన వాళ్ళు కారు....ఏదో నువ్వున్నావని వస్తోందది! వచ్చీ పోయీ పెద్దకోడలి గుణాలు అరువు తెచ్చుకొంటోందీవిడ!"

మూఢునిలా బాత్‌రూంకేసి పరుగెత్తాడు మూర్తి. అతగాడి తల గిరగిర తిరిగి పోతోంది.

ఇంటి ఖర్చు అదుపు తప్పిపోయింది ! మాలతి చెప్పిన దాన్లో అబద్ధమేమీ లేదు ! సాధారణంగా సాయంత్రం వేళల పిల్లలతో బయల్దేరి వచ్చే లలిత-అమ్మతో, మాలతితో కబుర్లు చెబుతూ కూర్చుంటుంది. ఈలోగా భార్యకోసం గోపాలమూ వస్తాడు. చీకటి పడుతుంది కబుర్లతో - పిల్లలు "ఆకళ్లో !" అంటూంటారు. పిల్లలందరికీ అన్నాలు పెడుతుంది మాలతి.

"పోనీ....ఇప్పుడింటికి వెళ్ళకపోతే ఏమే లలితా ! మీరిద్దరూ ఇక్కడే భోంచేయరాదూ ! మీ వదినె ములక్కాడలకూర చాలా చక్కగా చేస్తుంది. ఈ పూట చేసిందది...."

"అవునే లలితా !" అనేవాడు తను ప్రేమగా-తర్వాత తర్వాత మొహమాటంగా.

ఒక్కో రోజు... మాలతి ఇక తిరిగీ వండుకొనే ఓపిక లేక - ఉన్న దేదో వేసుక తినటం, లేదా ఓ గ్లాసు మజ్జిగ తాగి "నాకేమిటో కడుపులో నొప్పిగా వుంది.... ఆకలిగా లేదు !" అంటూ వుసూరుమని పడుకోవటం తనకు తెలియంది కాదు.

నెల నెలా పిల్లల ముగ్గురి పేరిటా తలకో పది రూపాయలు సేవింగ్స్ అకౌంటులో వేసేవాడు తను ! పండగ పండగకూ పిల్లలకూ, మాలతికీ బట్టలు తీసుకొనేవాడు ....

ఇప్పుడేమీ లేదు....అప్పు అయింది! పోనీ తీస్చాలో వచ్చు. కానీ అమ్మ చాదస్తంతో, అతి మడితో, అస్తమానం చాకిరీతో....మాలతి ఎలా తయారై పోతోంది? వంటలక్కలా.... వల్లకాడులా ఏకాంతం దొరకటం లేదు. అస్తమానం రైల్వే ప్లాట్‌ఫారమ్‌లా వుంటోంది ఇల్లు!

బంధువులంతా - వేటపాలెం జీడిపప్పు పరిశ్రమను తన ద్వారా ఉద్ధరింప జేస్తున్నారు! "డబ్బు పోస్ట్‌లో పంపుతా" మనే స్కీమ్‌లో జాంద్రపేటలోని అద్దకపు పరిశ్రమను తనద్వారా విస్తృత పరుస్తున్నారు! వాడరేవులో సముద్రస్నానాలతో వాళ్ళతో బాటు తనకూ 'పుణ్యం' తప్పటంలేదు. వెళ్తూ - వెళ్తూ "మీ అన్నా, నువ్వూ ఒక తల్లి పిల్లలయినా....వాడిగుణం వేరు - నీ గుణం వేరు...." అనే కాంప్లిమెంట్స్ మాత్రం దండిగా డబ్బులకు బదులుగా ఇచ్చి వెడుతున్నారు!

రేపు అక్క శకుంతల, దాని పిల్లలు వస్తారుట.... దానికేదో ఈ మధ్య గుండెల్లో నొప్పిగా వుంటోందట. ఓ నెల రోజులుండి మందు తీసుకుంటుందట ఇక్కడ. అమ్మ జాబు వ్రాయించింది.

ఏమిటీ పద్మవ్యూహం....? ఎక్కడుంది దారి అసలు తను ఎక్కడ దారి తప్పాడు?

"మీ స్నానం ఇంకా కాలేదా? మీ రాఘవ వచ్చాడు!" బాత్ రూం బయట నిల్చుని పిలుస్తున్న మాలతి పిలుపుతో బయట పడ్డాడు మూర్తి.

రెండు నెలలు తిరిగేసరికి - మూర్తికి ఏదో మైకం మెల్లిగా మంచు తెరలా విడిపోవటం మొదలెట్టింది....

వారం రోజులుగా జ్వరం వస్తోంది. తగ్గలేదు.... డాక్టర్‌కు చూపిస్తే టైఫాయిడ్ అనీ, హాస్పిటల్‌లో చేరటం మంచిదనీ, ఇంట్లో ఈ రద్దీలో విశ్రాంతి వుండదనీ చెప్పాడు.

ఇంటి నిండా మనుషులు? తలకు మించిన మమతలు.... సంపాదనకు మించిన ఖర్చు.... వెర్రి వెధవల్లా తయారయిన పిల్లలు....తనకి జబ్బు....బంధుత్వాల మధ్య ఇంతటి ఆర్థిక శాస్త్రం, ఇన్ని రాజకీయాలూ, ఇన్ని సమస్యలూ వుంటాయని....ఏ యూనివర్శిటీలూ, ఎన్ని డిగ్రీలూ తెలియజేయలేదు.

టెంపరేచర్ కాస్త తగ్గిన కాస్సేపూ ఆలోచనలతో బుర్ర పగిలి పోతుంది మూర్తికి. తిరిగి టెంపరేచర్ రెయిజ్ అవుతోంది.

డాక్టర్ రాజారావు ఆశ్చర్యంగా చూశాడు మూర్తి వేపు.

"ఇదేమిటి మూర్తీ ! నా మందుల దారి మందుదీ, మీ జబ్బు దారి మీదీ అయింది ! బహుశా మీకేదో "వర్రీ" కూడా వుందల్లే వుంది....ప్లీజ్ నాతో చెప్పదగినదయితే చెప్పండి...." స్నేహపూర్వకంగా అతగాడలా అడుగుతుంటే, మూర్తికి - రామ్‌చరణ్, ఛటర్జి, నరేంద్ర, సబిత, ఫతిమా అంతా గుర్తొచ్చా రొక్కసారిగా. ఇలాగే తనోసారి జబ్బున పడితే - వంతుల వారీగా హాస్పిటల్‌లో

తన ప్రక్కన వుండేవారు సేవలుచేస్తూ ! మాలతికి కాన్పు అయి ఆమె హాస్పిటల్‌లో వుంటే-తనకోసం, పిల్లలకోసం కారియర్ పంపేవారు....పొట్ట చేతబట్టుక వెళ్ళిన తనకు - తనలానే వచ్చిన వాళ్ళందరూ అండదండలిచ్చారు. పరస్పరం అప్పులు పుచ్చుకున్నారు. తీర్చుకున్నారు. ఆపదల్లో ఆదుకున్నారు. సరదాగా వాదులాడుకున్నారు. ఎవరి హద్దులలో వారు.... ఎవరి జీతాలతో - జీవితాలలో వారు ఇమిడిపోయారు. స్నేహాన్ని అపురూపంగా వాడుకున్నారు. కానీ ఈనాడు జరుగుతున్న దేమిటి ?

ఏమిటి మూర్తీ మీ సమస్య ! ....చెప్పండి నాచేత నైన సాయం చేస్తాను. "డాక్టర్ రాజారావ్ తిరిగీ హెచ్చరించటంతో మూర్తికి ఒక్కసారిగా లోపలున్న లావా లాటి బాధ పైకి పొంగింది.... అంతా విన్న రాజారావు నిట్టూర్చాడు.

"వాట్ ఎ పిటీ ! మీరు చెప్పిన విషయాలలో చాలా భాగం నాకూ అనుభవాని కొచ్చినవే మూర్తీ ! మాది తూర్పుగోదావరి జిల్లా....కోరి కోరి ఇంత దూరం వచ్చి ఇక్కడ ప్రాక్టీస్ పెట్టానంటే, ఎంతగా ఈ బంధుప్రేమలతో హడలి పోయానో మీరే ఊహించుకోండి ! అందరి మధ్యా వుండగా—అందరికీ అన్ని సాయాలూ చేశాను. డబ్బు ఖర్చు పెట్టాను. ఏంలాభం ! ఏ ఒక్కరికీ తృప్తి కలిగించ లేక పోయాను ! నా క్షేమం, నా సంతోషం కోరేవారు నాకొక్కరూ కనిపించలేదు నా బంధువులలో ! నాదగ్గర డబ్బు, నా సేవ, అవసరమైతే నా తోలు కూడా వలిచి....రక్తమాం

సాలు పంచుక, తీసుక, దోచుక పోదామనే వారి వుద్దేశ్యం ! తల్లి లేదు....చెల్లి లేదు....అంతా ఒకటే స్వార్థం ! తమకు నన్ను ఎన్ని విధాలుగా ఉపయోగించుకోవాలా అన్న ధ్యాసే ! మీరు విన్నారో లేదో-కబీర్‌దాస్ దోహే ఒకటుంది. దాని అర్థం 'చందనం వృక్షాలు ఎప్పుడూ అందుబాటులో వున్న భిల్లు (కొండజాతి) వనిత....వాటిని వంట చెరుకుగా వుపయోగిస్తుందట !, అంతే మరి-మీరు చిరాకు నణచుకున్నంత కాలం ! మీ ఆవిడ నోరెత్తనంత కాలం ! మీ బంధువులంతా మిమ్మల్ని దేవుడనే అంటారు. అది లేని మరుక్షణం-మీరు దెయ్యంగా మారి తీరుతారు ! దెయ్యంగా నేనిక్కడకు వచ్చాను. ఈ రోజు దూరాన వున్నానా ?
ఏ బంధువుకో జబ్బో- పెళ్ళో, మరో ఆపదో వస్తే....ఇక్కణ్ణుంచే ఓ పాతికో, పరకో పంపి చేతులు దులుపుకుంటాను.... ఇక నేనెలాగూ అందను కాబట్టి, నా డబ్బులో కొంతేనా అందుతోంది కాబట్టి, అబ్బో! మీవాడు మంచివాడు !' అంటున్నారు....అనకుంటే అదీ పంపనేమోనని భయంతో మాత్రమే !

సర్లెండి-ఏదో చెప్పుకు పోతున్నాను. మీరు, మీ శ్రీమతీ కాస్త మొగమాటాలు తగ్గించుకోండి ! కీర్తి కండూతికి లోబడకండి ! అదొక్కటే ప్రస్తుత పరిస్థితుల్లోనుంచి మిమ్మల్ని కొంతవరకేనా రక్షించగల ఆయుధం.... మరి వస్తా !

రాజారావు లేచి వెళ్ళిపోయాడు !....హితోపదేశం పూర్తయ్యాక, అర్జునుడికి రణరంగం స్పష్టంగా కనిపించి

నట్లు....అందాకా తననావరించుకుని వున్న మబ్బు తెర ఏదో తొలగిపోయినట్లైంది మూర్తికి! సాయంత్రం మాలతి దగ్గరకు వచ్చి—భోరున ఏడ్చింది.

"మీకీ జబ్బు రావటం....నే చేసిన పాప ఫలితమట! ఆ పాపమేమిటో తెలుసా? ఆడబడుచులకు సరిగా మర్యాదలు జరపటం లేదట! అత్తగారి విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నానట! అసలు మీకిక జబ్బు తగ్గదట! అప్పుడు గానీ నాపొగరు అణగదట...." తీరి కూర్చుని-విశ్రాంతులూ, భోజనాలూ జరుపుకుంటూ బంధువులంతా విసురుతున్న వాగ్బాణాలవి!....ఎంతటి విషం!వీళ్ళ కంటే పాములూ, పులులూ, సింహాలూ నయం కాదూ?....వాటికి నయవంచన చేతకాదు!

"....మూర్తీ!" చల్లని చేతి స్పర్శ నుదుటిమీద పడింది.

ఉలిక్కి పడినట్లు కళ్లు తెరచి చూశాడు మూర్తి. మురళీ, అతగాడి వెనకాలే శారద నిల్చుని వున్నారు బెడ్ దగ్గరగా.

"అన్నయ్యా!...." ఆశ్చర్యంగాచూశాడు మూర్తి. చీకటి తెరలు పటాపంచలై పోయాయి. కొత్తగా జ్ఞానజ్యోతి లాటిదేదో హృదయంలో వెలిగినట్లైంది మూర్తికి,

"అవున్రా మూర్తీ! నువ్వు జబ్బు పడ్డావని తెలిసి.... ఇంతకు ముందుగానే వచ్చాం నేనూ. మీ వదినా!" మురళి మూర్తి బెడ్ మీద కూర్చుంటూ అన్నాడు.

రాయిలా మారిన అన్నయ్య, గయ్యాళిగా బిరుదు వహించిన వదిన—అందుక్కారకులెవరు? ఇన్నేళ్ళుగా-వీళ్ళందరి మధ్య వుండి.... ఇక ఎక్కడికీ వెళ్ళే అవకాశం లేని అన్నయ్య—దేవుడిలాంటి అన్నయ్య....నిజమే! దేవుడిలానే శిలలా మారిపోయాడు. ఏ అనుభూతులూ, ప్రేమలూ లేని కఠిన పాషాణంలా మారి పోయాడు! వదిన ఆడది....ఆత్మ నిగ్రహం అట్టే లేని సహజ స్వభావంతో నోరు పెంచుకొంది! రాక్షసిగా మారిపోయింది.

"ఏమిట్రా మూర్తీ! కొత్త వాళ్ళను చూచినట్లు చూస్తున్నావ్" మురళి అడుగు తున్నాడు.

"ఏం లేదన్నయ్యా! మేమీ ప్రాంతానికి రాగానే—నువ్వు, వదిన మాతో ఏమన్నారో గుర్తుకు వచ్చిందంతే! అందులోని సందేశం మాకు బోధ పడేసరికి-చాలా రోజులు పట్టింది...." నిట్టూర్చాడు మూర్తి.

"సర్లె! అవన్నీ ఇప్పు డెందుకు....ఇంకా ఎన్నాళ్ళుండాలి హాస్పిటల్లో?"

"ఏమో...." పేలవంగా నవ్వాడు మూర్తి.

"సరే .... డాక్టరుగారి నడుగుతాలే .... రేపొద్దున్న నేనూ, మీ వదినా వెళ్ళాలి."

"అదేం? నాలుగు రోజులుండరూ!"

"ఇంకా నీ బంధుప్రేమ తగ్గలేదూ?" ఊహూఁ! నాకు పొలం పన్లున్నాయి. నా వెంట అమ్మనూ నాన్ననూ

ST. JOSEPH'S GIRLS HIGH SCHOOL, GUNTUR.

పిల్చుకెడతాను ! లలితకు ఘట్టిగా చెప్పాను....మాలతికి ఆరోగ్యం బాగలేదనీ, అంచేత తరచు ఆమెకు పని కల్పించి—ఆమెకు చికాకు కలిగించవద్దనీ. శకుంతలక్కయ్య బావలు వేరే ఇల్లు చూచుకుంటారటలే రేపు....రాఘవ. మిగతా బంధువర్గానికంతా హోటళ్ళదారులు చెప్పే వచ్చాను. నువ్వు కాస్త కోలుకున్నాక, మాలతిక్కూడా మంచి మందులిప్పించే ఏర్పాటు చూడు. ఇంతకంటే నేనేం సాయం చేయలేను. ఆ మాటచెప్పి వెళదామనే వచ్చాను.... ఎవరిహద్దులలో వాళ్ళనుంచిన నేనూ, మీ వదినా చెడ్డవాళ్ళం కానే అయ్యాం ఏ నాడో !....నువ్వయినా సుఖంగా వుంటే అంతేచాలు....మరి వెళ్ళొస్తా !"

మురళి, శారద వెళ్ళిపోయారు....మూర్తి అప్పటికప్పుడే ఉత్తరం ఒకటి వ్రాసి, అటుగా వచ్చిన సిస్టర్ చేతికిచ్చాడు పోస్ట్ చేయించమని. అతగాడిలో కొత్త శక్తేదో వచ్చినట్లయ్యింది....

నెల రోజుల తర్వాత—

ట్రెయిన్‌లో తిరిగీ గ్వాలియర్‌కు వెళ్తున్న మూర్తి, మాలతిల మనస్సులు-ఏదో "గని"లో నుంచి బయట పడ్డంత తేలికగా వున్నాయి....

"మీరు ఉత్తరం వ్రాయగానే-పాపం మీ స్నేహితులంతా మీ మేనేజరుగారికి నచ్చజెప్పి, మనలను తిరిగి

అక్కడకు వెళ్ళగలిగే ఏర్పాటు చేయబట్టి సరిపోయింది...ఇక అక్కడే వుండిపోదాం. ఏమంటారు?.... అంది మాలతి. ఆమె నవ్వుతుంటే పళ్ళూ, కళ్ళూ వెలికి వస్తున్నాయి!

"అవును-మన బంధువులు అక్కడే వున్నారు...." క్షణంకాలం ఆగి, హఠాత్తుగా ఏదో గుర్తుకు వచ్చిన వాడిలా అన్నాడు మూర్తి.

"నువ్వు దైవోపహతులు.... ప్రేమోపహతులు.... లాటి మాటలు విన్నావు కదూ మాలతీ!"

"విన్నాను....ఏవో కథల్లో చదివాను కూడా!" అంది మాలతి.

"అలాగే....మనలాటివారికో చక్కటిపేరు పెట్టొచ్చు 'బంధోపహతులు .... రాబంధోపహతులు' అని కదూ.... అదేం సమాసమో - సంధేమిటో - అసలా పదాలు అలా అనవచ్చో, అనకూడదో నాకనవసరం.... పేరు మాత్రం బ్రహ్మాండంగా వుంది .... అవునా? 'బంధోపహతులు'! వెర్రిగా నవ్వుతున్నాడు మూర్తి.

("జ్యోతి" ఆగష్టు '71)